
# పబ్బతి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న సీఎం

## 10 కోట్ల రూపాయలతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నాగర్ కర్నూల్, బతుకమ్మ :నాగర్‌కర్నూల్ జిల్లా ఉరుకొండపేట పబ్బతి ఆంజనేయ స్వామి వారిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 10 కోట్ల రూపాయలతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాజకీయ ప్రస్థానంలో జెడ్పీటీసీగా ఎన్నికైన 20 ఏళ్ల నాటి మరిచిపోలేని అనుభూతితో గ్రామంలో అడుగుపెట్టిన ముఖ్యమంత్రి కి ఆత్మీయులు, ఆనాటి పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆనాటి సహచరులతో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ సమావేశంలో అలనాటి తోటి సహచరులను ఆప్యాయంగా పలకరిస్తూ ఒక్కొక్కరితో కరచాలనం చేస్తూ వారి బాగోగులు అడుగుతూ ముఖ్యమంత్రి గత





అనుభవనాలను నెమరువేసుకున్నారు. కొందరు 20 ఏళ్ల కిందట దిగిన ఫోటోలను చూపిస్తూ పాత అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఉరుకొండిపేట గ్రామంలో కోలాహలం నెలకొంది.

# దొడ్డికొమరయ్య స్ఫూర్తితో పోరాటం చేయాలి

## సిపిఐ (ఎం ఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ

సిరికొండ, బతుకమ్మ :తెలంగాణ సాయుధ రైతంగా పోరాటంలో తొలి అమరడు దొడ్డికొమరయ్య స్ఫూర్తితో పోరాటం చేయాలని సిపిఐ (ఎం ఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతిని ఘనంగా నిర్వహించి, దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బానిసత్వం, భూమి కోసం, భుక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కామ్రేడ్ దొడ్డి కొమరయ్య ముందు భాగంలో నిలిచి పోరాడిన వీర యోధుడన్నారు. ఈ సమరంలో 4వేల మంది అమరులు అయ్యారని, 3వేల గ్రామాలు విముక్తి అయ్యాయని, 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఈ గొప్ప కమ్యూనిస్ట్ ఉద్యమం లో కొమరయ్య ముందు భాగంలో నిలిచాడన్నారు. దొడ్డికొమరయ్య అమరత్వం స్ఫూర్తితో సాయుధ రైతాంగ పోరాటం మరింత ఉధృతం అయిందని, భూమి పోరాటం లో గుత్పల సంఘము పెట్టి ప్రజల్ని కూడా చైతన్యం చేసి పోరాడిన చరిత్ర కమ్యూనిస్ట్ పార్టీదన్నారు. కొందరు మతవాదులు విశాలమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరించి మత ఘర్షణల పోరాటంగా చిత్రీకరించే కుట్రలకు పునుకుంటుందన్నారు. వారి కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని, కామ్రేడ్ దొడ్డికొమరయ్య స్ఫూర్తిని చాటడమంటే బలమైన పోరాటాలను చేపట్టి, ఉద్యమాలను నిర్మించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం ఎల్) మాస్ లైన్




ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ అధ్యక్షత వహించగ డివిజన్ నాయకులు ఆర్ దామోదర్, ఎం సాయరెడ్డి, బి బాబన్న, బి కిశోర్, ఎం అనీష్, మండల నాయకులు ఎస్ కిశోర్, జి బాల్ రెడ్డి, జి ఎర్రన్న, ఒ ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

## రెండ్రోజులుగా నామమాత్రపు తనిఖీలు...నోటీసులతో సరి







నిజామాబాద్, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు గత రెండు రోజులుగా వివిధ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా అపరిశుభ్రత కలిగిన వంటశాలలు, పాత్రలు అపరిశుభ్రంగా ఉండడం, నిషేధిత సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడకం, కృత్రిమ రంగు వేసిన మాంసం అమ్మకానికి ఉంచడం, ఫ్రిజ్‌లో ఆహారాన్ని సరైన పద్ధతిలో నిల్వ చేయకపోవడం – కలుషితమైన ఆహారాన్ని వెంటనే ధ్వంసం చేయడం జరిగిందన్నారు. మూతలు లేని పాత్రల్లో ఆహారాన్ని బహిరంగంగా ఉంచడం వాటిని గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఆహార వ్యాపారులు ఆహార పరిశుభ్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం కారణంగా ఆహారం కలుషితమై ప్రజారోగ్యానికి హాని కలిగే అవకాశం ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఐ చట్టం 2006 సెక్షన్ 32 ప్రకారం ఇంప్రూమెంట్ నోటీసులు జారీ చేశారు. 14 రోజుల్లో లోపాలను సరి చేయని వారిపై కఠినంగా జరిమానాలు విధించి, లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకోబడుతాయన్నారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఐ లైసెన్స్ లేని, అపరిశుభ్రంగా ఉన్న దుకాణాల నుంచి ఆహారాన్ని కొనుగోలు చేయవద్దని ప్రజలకు ఆహార భద్రతా శాఖ విజ్ఞప్తి చేసింది.

తినే అన్నంలో కల్తీలు . . . తాగే పాలలో రసాయనాలు చివరకు పసిపిల్లలకు పట్టే పాలపొడిలు ప్రాణాంతక పదార్థాలు. లాభార్జనే ధ్యేయంగా హోటళ్ళు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు మొదలుకుని చివరకు టీ స్టాల్ లలో కూడా కల్తీ ఆహార పదార్థాల అమ్మకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా బేకరిలలో తయారయ్యే ఉత్పత్తులకు ఎక్స్ పైరీ డేట్ లేకుండానే ప్యాకింగ్ లు బయటకు వస్తున్నాయి. వాటితో పాటు రెడిమెడ్ తినుబండారాల తయారీలోనూ, ప్యాకింగ్ లోనూ ఇదే మోసం కనబడుతుంది. ప్రధానంగా జిల్లాలో నాన్ వెజ్ ఫుడ్ ను విక్రయించే స్టార్ హోటల్ మొదలుకుని దాబాల వరకు వినియోగించే మాంసంతో పాటు అందులో ఉండే పదార్థాలకు చివరకు మసాలలు కూడా కల్తీనే వినియోగిస్తున్నారు. వంటలో వాడే నూనె మొదలుకుని, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లో వాడే సాస్ ను కూడా కల్తీగా తయారి చేసి వినియోగిస్తున్నా పట్టించుకునే వారు లేరని విమర్శలున్నాయి. ప్రధానంగా జంతువధ నిషేదం ఉన్న శనివారాల్లో హోటళ్ళు, దాబాలు, మండిలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లలో మాంసం వినియోగిస్తుంటే అది రెండు రోజుల ముందుగా ఫ్రీజ్ లో ఉంచిన మాంసం పదార్థాలను వండి విక్రయిస్తుంటే ఫుడ్ సేఫ్టీ అధికారులు కల్లుమూసుకున్నారన్న వాదనలు లేకపోలేదు. శనివారం పూట జిల్లాలో అధికారులే ఉండరని ఇక తనిఖీలు ఎక్కడ అని విమర్శలున్నాయి. హాస్టళ్ళు, హోటళ్ళు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లకు లైసెన్స్ లు లేకున్నా నిర్వహిస్తుంటే పట్టించుకునే వాడే లేరనే ప్రధాన ఆరోపణ ఉంది. అసలు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉద్యోగుల కొరత పేరుతో అందుబాటులో ఉండరనే విమర్శలు లేకపోలేదు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

## కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



భిక్కనూరు, బతుకమ్మ : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర యువతకు సూచించారు. భిక్కనూరు మండలం రామేశ్వర్ పల్లి గ్రామంలో తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని, రక్తదానంతో ఎంతోమందికి నూతన జీవితాలను ఇవ్వచ్చని, ముఖ్యంగా తల సేమియా బాధితులకు, రోడ్డు ప్రమాద బాధితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి గ్రామ సర్పంచ్ రాణి, కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సూర్యకాంత్ రెడ్డి, భిక్కనూరు సిఐ జగడం నరేష్, ఎస్ఐ ఆంజనేయులు, భిక్కనూరు మండల వైద్యాధికారిణి దేవి ఏమిమా, గ్రామ ఉపసర్పంచ్ వినోద్ గౌడ్, దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్ ఎన్ ఎస్ ఎస్ అధికారి డాక్టర్ బందెల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు..




# ప్రజలకు అందుబాటులో ఉండి స్నేహపూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి



వారికి పోలీసు గెస్ట్ హౌజ్ వద్ద పోలీసు అధికారులు లాంచనంగా అధికారికంగా స్వాగతం పలికారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం నిజామాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో బాసర జోన్ 2 పరిధిలోని నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లా స్థాయి అధికారులతో డిఐజి భాస్కరన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేంజ్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు, సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల పోలీసు అధికారులు, యూనిట్ ఇన్‌చార్జిలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని తమ జిల్లాలకు సంబంధించిన పనితీరు, నేర నియంత్రణ చర్యలు, ఎదురవుతున్న సమస్యలు, చేపట్టాల్సిన కార్యాచరణపై డీఐజీకి వివరించారు. ఈ సమావేశంలో నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జగిత్యాల్ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీసీపీ శుభం ప్రకాష్, మూడు జిల్లాల అదనపు ఎస్పీలు, రిజర్వ్ విభాగం అధికారులున్నారు.